క్లుప్తంగా

జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించిన ఐజీ



పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ అశోక్ కుమార్

కాకినాడ క్రైం: ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ మంగళవారం కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సందర్శించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో శాంతిభద్రతల స్థితిగతుల గురించి తెలుసుకుని, పలు కీలక సూచనలు చేశారు.

వైద్యుల రక్తదానం



రక్తదానం చేస్తున్న వైద్యురాలు

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లో పలువురు వైద్యులు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో జీజీహెచ్‌లోని బ్లడ్‌బ్యాంక్‌లో వీరు మంగళవారం రక్తదానం చేశారు. రక్త నిల్వల కొరత ఏర్పడిన కీలక సమయంలో సుమారు 20 మంది వైద్యులు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారని డాక్టర్ విష్ణువర్ధన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ప్రశంసించారు.

శని ప్రార్థనతో సర్వ దోష నివారణ



శనైశ్చరునికి పూజలు చేస్తున్న యాతగిరి మధ్వేష్

బోట్‌క్లబ్: శని ప్రార్థన సకల దోషాల నుంచి రక్షిస్తుందని వేద పండితులు యాతగిరి మధ్వేష్ అన్నారు. శనైశ్చర జయంతి సందర్భంగా చొల్లంగి ఆంజనేయ ఆలయ ప్రాంగణంలోని శనైశ్చరుని విగ్రహానికి మంగళవారం అభిషేకం నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ప్రధాన అర్చకుడు గండికోట సుదర్శన్ మాట్లాడుతూ సాగర సంగమ క్షేత్రంలో చంద్రుడు తపసు చేసిన ప్రాంతంగా చొల్లంగిని పురాణాలలో ప్రస్తావిస్తారన్నారు. అంతటి మహిమ కలిగిన ఈ ప్రాంతంలో శని దోష నివారణకు అనేక కార్యక్రమాలను వేద పండితుల సహకారంతో క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు.


కౌన్సెలింగ్‌తో మానసిక సమస్యలు దూరం



సైకాలజిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న సభ్యులు

బోట్‌క్లబ్: కౌన్సెలింగ్ ద్వారా మానసిక సమస్యల పరిష్కారానికి గ్లోబల్ అసోసియేషన్ ఆఫ్ సైకాలిజిస్ట్లు కృషి చేస్తోందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక మెహర్‌నగర్‌లోని వాదూల సంలో జరుగుతున్న వేసవి విశిష్ట మనోవిజ్ఞాన శిక్షణ కార్యక్రమానికి ఆయన మంగళవారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రముఖ సైకాలజిస్ట్ అద్దేపల్లి ఉదయభాస్కర్ ఒక వ్యక్తి తన మానసిక సమస్యను గుర్తించి దానిని పరిష్కరించుకోవాలనుకుంటే సైకాలజీ మార్గం చూపిస్తుందన్నారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులను సభ్యులు సత్కరించారు. అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు వి. జనార్దనం, నగరంలోని వ్యక్తిత్వ వికాస నిపుణులు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువుకు రూ.లక్ష వితరణ



డాక్టర్ సతీష్‌కు రూ.లక్ష చెక్కును అందజేస్తున్న వీరభద్రారెడ్డి దంపతులు

కాకినాడ క్రైం: పేద విద్యార్థుల చదువుల కోసం వీరభద్ర ఎక్స్‌పోర్ట్స్ అధినేత ద్వారంపూడి వీరభద్రారెడ్డి రూ.లక్ష దానం చేశారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో శ్రీయువసేన స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ బొల్లం సతీష్‌కు మంగళవారం కాకినాడ గ్లాస్ హౌస్ సెంటర్‌లోని బ్లడ్ బ్యాంక్‌లో అందజేశారు. వీరభద్రారెడ్డి మాట్లాడుతూ ఏటా పేద పిల్లలకు తనవంతు సహకారం అందించాలని నిర్ణయించినట్టు తెలిపారు. అందులో భాగంగా సతీసమేతంగా విరాళాన్ని అందజేశానని అన్నారు.

తడబడితే తప్పదు మూల్యం

- ముందస్తు అప్రమత్తతో జాగ్రత్త
- ఆకట్టుకునే ప్రచారాలతో మోసపోవద్దు
- పాఠశాలల పూర్తి సమాచారం తెలుసుకున్నాకే పిల్లలను చేర్పించాలి



బాలాజీచెరువు: వేసవి సెలవులు ముగుస్తున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించేందుకు మంచి విద్యాలయాల కోసం ఆరా తీస్తున్నారు. ఇప్పటికే పుట్టగొడుగుల్లా ఉన్న ప్రైవేటు విద్యా సంస్థలు వివిధ ప్రాంతాల్లో నూతన శాఖలను ప్రారంభించేందుకు సమాయత్తమవుతున్నారు. భారీస్థాయిలో ప్రచారాలు చేస్తూ తల్లిదండ్రులను ఆకర్షించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా సంస్థలపై విద్యాశాఖ నియంత్రణ కొరవడడంతో అనుమతులున్న పాఠశాలలను గుర్తించడంలో తల్లిదండ్రులు అయోమయానికి గురవుతున్నారు. కొత్త ప్రైవేటు పాఠశాల ప్రారంభించాలంటే విద్యాశాఖ అనుమతి తప్పనిసరి. ప్రాథమిక స్థాయికి జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి, ఉన్నత తరగతులు ప్రారంభించాలంటే విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ (ఆర్జేడీ) ద్వారా పాఠశాల విద్యా కమిషనర్ అనుమతి పొందాలి. సీబీఎస్ఈ సిలబస్ బోధించేందుకు కేంద్ర విద్యామండలి సమ్మతించాలి.

అవగాహన ఉంటేనే..

గత విద్యా సంవత్సరం నగరంలో ఓ కార్పొరేట్ పాఠశాల తమకు అన్ని అనుమతులు ఉన్నాయని ప్రచారం చేసుకోవడంతో తల్లిదండ్రులు వారి పిల్లలను ఆ విద్యా సంస్థలో చేర్చారు. ఫీజులు చెల్లించి, పుస్తకాలు సైతం తీసుకున్న తరువాత మరో పాఠశాలలో విలీనం చేశారని చెప్పడంతో తల్లిదండ్రులు ఆందోళనలు చేశారు.

వీటిపై ఆరా తీయండి

ప్రతి విద్యా సంస్థ ప్రభుత్వం నుంచి కచ్చితంగా గుర్తింపు పొందాలి. చాలా విద్యాసంస్థల బోర్డులు, ప్రకటనలు నిశితంగా పరిశీలిస్తే రిజిస్టర్డ్ అని ఉంటుంది. రిజిస్ట్రేషన్ ఎవరైనా చేసుకోవచ్చు, కానీ విద్యాశాఖ నుంచి గుర్తింపు తప్పనిసరి. గుర్తింపు పొందిన విద్యా సంస్థలలోనే తల్లిదండ్రులు పిల్లలను చేర్పించాలి. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇతర విద్యా సంస్థల తరఫున పరీక్షలు రాయిస్తుంటారు. అలా పరీక్ష రాసిన విద్యార్థులను ప్రభుత్వం ప్రైవేటు విద్యార్థిగానే పరిగణిస్తుంది. మరికొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు బ్రాంచీల పేరుతో పాఠశాలలను, కళాశాలలను నడుపుతూ ఎక్కడో ఉన్న మెయిన్ బ్రాంచి ద్వారా పరీక్షలు రాయిస్తుంటారు. ఇలాంటి విషయాలలో తల్లిదండ్రులు కచ్చితంగా అవగాహన కలిగి ఉండాలి.

గుర్తింపు పొందిన పాఠశాలల జాబితా విడుదల చేస్తాం



ప్రతి ప్రైవేటు విద్యా సంస్థ తప్పకుండా ప్రభుత్వ నిబంధనలు పాటించాలి. విద్యార్థులకు పాఠశాలల్లో క్రీడా మైదానంతో పాటు అన్ని వసతులు పక్కాగా ఉండాలి. లేకుంటే ఈ పాఠశాల గుర్తింపు రద్దు చేస్తాం. అలాగే విద్యా సంస్థ పక్కాగా రిజిస్ట్రేషన్‌తో పాటు ప్రభుత్వ గుర్తింపు తప్పక పొంది ఉండాలి. ప్రైవేటు సంస్థలు ఆకట్టుకునే ప్రకటనలను నమ్మి మోసపోవద్దు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాదీ గుర్తింపు పొందిన పాఠశాలల వివరాలు తెలియజేస్తాం.

– పిల్లి రమేష్, డీఈఓ, కాకినాడ జిల్లా

తీసుకోవాల్సిన జాగ్రత్తలివీ..

- తొలుత పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు ఉందా లేదా అనేది చూసుకోవాలి.
- ప్రభుత్వ ఇంజినీరింగ్ విభాగం జారీ చేసిన పాఠశాల భవనం నాణ్యత ధ్రువీకరణ పత్రాన్ని పరిశీలించాలి.
- మౌలిక వసతులు చూసుకోవాలి.
- మరుగుదొడ్లు, నీటి సదుపాయాలు తప్పనిసరి.
- క్రీడా ప్రాంగణం, ఫిజికల్ ట్రైనర్ ఉన్నారా లేదా తెలుసుకోవాలి.
- ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో 20 నుంచి 40 మందికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలి.
- ఉన్నత పాఠశాల అయితే సబ్జెక్టుల వారీగా ఒకరు చొప్పున ఉపాధ్యాయుడు ఉండాలి.
- సురక్షిత రవాణా సదుపాయానికి బస్సులకు రవాణాశాఖ సామర్థ్య పరీక్ష పత్రం ఉందో లేదో తెలుసుకోవాలి.
- సుశిక్షితుడైన డ్రైవరు తప్పనిసరి.
- జీ-1 భవనాలు ఉంటే అగ్నిమాపక పరికరాలు, స్థాయి దాటితే మంటలు ఏర్పాట్లు ఉండాలి.

ఇలా అయితే ఇబ్బందే

ప్రభుత్వం అనుమతి లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పితే భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తుతాయి. చైల్డ్ ఇన్ఫో ఆధారంగానే విద్యార్థుల ప్రగతి పత్రాలు, బదిలీ ధ్రువపత్రాలు జారీ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ అనుమతి లేని వాటిలో ఈ నమోదు ఉండదు. ఆయా విద్యార్థులను బడిబయట ఉన్నవారిగా పేర్కొంటున్నారు. ఫలితంగా సమస్యలు ఏర్పడతాయి.

చమురు సంస్థల తీరుపై రైతుల నిరసన



యండమూరులోని ఆయిల్ సంస్థల రిగ్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు, గ్రామస్తులు

కరప: యండమూరులోని ఓఎన్‌జీసీ, గెయిల్ సంస్థల కార్యకలాపాలతో, వాహనాల రాకపోకలతో పొలాలకు వెళ్లే రహదారిని ధ్వంసం చేయడమే కాకుండా, గ్రామాభివృద్ధికి సహకరించడం లేదని సదరు సంస్థల పనితీరును నిరసిస్తూ సర్పంచ్ మార్నెళ్ల శివ ఆధ్వర్యంలో రైతులు, గ్రామస్తులు ధర్నా చేశారు. యండమూరులో సదరు సంస్థల రిగ్ పాయింట్ వద్ద టెంట్‌వేసి మంగళవారం గ్రామస్తులు, రైతులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ ఆయా సంస్థలకు సంబంధించిన భారీ వాహనాల రాకపోకలతో రహదారి ధ్వంసమైందని, లింగోల వంతెనను ఢీకొట్టి ధ్వంసం చేశారన్నారు. దీంతో 1100 ఎకరాలకు చెందిన రైతులు, అక్కడి పనులకు వెళ్లే కూలీలు నానా అవస్థలు పడుతున్నారని వాపోయారు. తమ గ్రామం నుంచి చమురు నిక్షేపాలు పట్టుకుపోతున్నా, గ్రామాభివృద్ధికి సహకరించడం లేదని సర్పంచ్ శివ అసంతృప్తి వ్యక్తంచేశారు. ఆయిల్ సంస్థల వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో ఎస్‌పీఎఫ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులు, గ్రామ సర్పంచ్‌తో చర్చించారు. రహదారి విషయమై ఆయా సంస్థలతో చర్చించి, పరిష్కరించుకోవచ్చని పోలీసులు సర్దిచెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

కార్మికుల వేతనాలు పెంచాలి



నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు

బోట్‌క్లబ్: పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని సమ్మె చేస్తున్న నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ కార్మికులకు సీఐటీయూ నగర కమిటీ మద్దతు తెలిపింది. మంగళవారం భిక్షాటన చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులను కలిసి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సీఐటీయూ కో కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. మే 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నిరసన తెలియచేసి విధులకు హాజరైన కార్మికులు 15వ తేదీ నుంచి సమ్మె చేపట్టినా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. తక్షణమే ప్రభుత్వం, అధికారులు కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలన్నారు.

మత్స్యకారునికి మరబోటు అందజేత

పీఎంఎంఎస్‌వై ద్వారా డీప్ సీ ఫిషింగ్ వెసల్ మంజూరు



బోటు ట్రయల్ రన్ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కాకినాడ రూరల్: ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) ద్వారా కరప గ్రామానికి చెందిన మత్స్యకారుడు సిరంగిల సుధాకర్‌కు మంజూరైన డీప్ సీ ఫిషింగ్ వెసల్ (బోట్)ను మత్స్యశాఖ అధ్వర్యంలో మంగళవారం అందజేశారు. వాకలపూడి ఫిషింగ్ హార్బర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తదితరులు దానిని అందజేసి ట్రయల్ రన్ వేశారు. జిల్లా మత్స్యశాఖాధికారి కృష్ణారావు మాట్లాడుతూ 2023-24 సంవత్సరంలో సుధాకర్‌కు పీఎం ఎంఎస్‌వై పథకం కింద రూ.1.2 కోట్ల విలువైన డీప్ సీ ఫిషింగ్ బోట్ మంజూరైందని, ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60 శాతంగా రూ.72 లక్షలు సబ్సిడీ వచ్చిందని, లబ్ధిదారుడు 40 శాతం వాటా రూ.48 లక్షలు భరించాల్సి ఉంటుందన్నారు. లబ్ధిదారుడి వాటాలో బ్యాంక్ రుణం రూ.20 లక్షలు వచ్చిందన్నారు. మత్స్యకారులు స్వయం సమృద్ధి సాధించేందుకు పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ మత్స్యశాఖ అధికారి, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ రెడ్డి, అసిస్టెంట్ ఫిషరీష్ అధికారి కె.మధుబాబు, ఎఫ్‌డీఓ నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ అసోసియేషన్‌పై రాజకీయాలు సరికాదు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రఫీ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): క్రికెట్ అసోసియేషన్‌పై రాజకీయాలు సరికాదని తూర్పుగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, మాజీ రంజీ క్రీడాకారుడు రఫీ, కార్యదర్శి పి.సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి అప్పారావు పేర్కొన్నారు. స్థానిక రంగరాయ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంగళవారం వారు మాట్లాడారు. 1998 నుంచి 2016 వరకు బాపిరాజు విజయకుమార్ తదితరులు అసోసియేషన్‌ను నిర్వహించి అనేక అవకతవకలకు పాల్పడ్డారని, అటువంటి వారు ప్రస్తుత అసోసియేషన్‌పై అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. గత అసోసియేషన్ సమయంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నుంచి వచ్చిన నిధులపై ఆడిట్ నివేదిక లేదన్నారు. ప్రస్తుత రాష్ట్ర అసోసియేషన్ కార్యదర్శి రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు సహకారంతో అసోసియేషన్‌కు నిధులు వచ్చాయన్నారు. తమపై చేసిన ఆరోపణలపై న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. ఒకే ఏడాది 8 మంది క్రీడాకారులు రంజీ ట్రోఫీ ఆడారని వివరించారు. సమావేశంలో అసోసియేషన్ కోశాధికారి మెట్ట వెంకటేష్, పలువురు క్రీడాకారులు తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

నిత్య స్మరణీయుడు కందుకూరి



కందుకూరికి నివాళులు అర్పిస్తున్న వాకర్స్ సంఘం సభ్యులు

కాకినాడ రూరల్: సంఘ సంస్కరణ ఉద్యమానికి నాంది పలికిన కందుకూరి వీరేశలింగం నిత్య స్మరణీయుడని సాహితీవేత్త డాక్టర్ వేదుల శిరీష పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్ బోట్‌క్లబ్ ఉద్యానవనం వద్ద వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో కందుకూరి వర్ధంతిని మంగళవారం నిర్వహించి నివాళులు అర్పించారు. మూఢ నమ్మకాలపై తన సాహిత్యం, పత్రికలు, నాటక ప్రదర్శనలు, క్రియాశీలకమైన పనుల ద్వారా పోరాడారని, మహిళా చైతన్యం, మహిళల విద్య కోసం నిరంతర కృషి చేశారన్నారు. కార్యక్రమంలో వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్, కార్యదర్శి దాసరి శ్రీధర్, ప్రసాద్ నాయుడు, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితిపై అవగాహన

బోట్‌క్లబ్: వైద్యపరమైన అత్యవసర పరిస్థితులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక సాత్వా దంత వైద్యశాలలో మంగళవారం ప్రపంచ అత్యవసర వైద్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్రీవల్లి పాల్గొన్నారు.

ఇంటింటికీ రేషన్ కొనసాగించాలి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సుంకర విద్యాసాగర్
- ఎండీయూ ఆపరేటర్ల నిరసనకు మద్దతు
- బాలాజీచెరువు వద్ద బైఠాయింపు



ఆందోళన చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, ఎండీయూ ఆపరేటర్లు

కాకినాడ సిటీ: ఇంటింటికీ రేషన్ పంపిణీ విధానాన్ని కొనసాగించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సుంకర విద్యాసాగర్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎండీయూ వ్యవస్థను రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సూచన మేరకు ఆపరేటర్ల సమాఖ్య జేఏసీయూ నుంచి కలెక్టరేట్ వరకు మంగళవారం నిర్వహించిన నిరసన ప్రదర్శనకు వైఎస్సార్ సీపీ మద్దతు ప్రకటించింది. బాలాజీ చెరువు సెంటర వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు సంఘీభావం తెలియజేసి దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. అక్కడే వైఎస్సార్ సీపీ నాయకులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ పేద ప్రజలు గంటల తరబడి రేషన్ దుకాణాల వద్ద పడిగాపులు పడకుండా ఉండాలనే ఉద్దేశంతో, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత దగ్గర చేయాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎండీయూ వ్యవస్థను అమలు చేశారన్నారు. వాటి ద్వారా ఇళ్ల ముంగిటకే రేషన్ సరుకులు అందించే విధానానికి ప్రజలు కూడా సంతోషించారన్నారు. మంచి లక్ష్యంతో పెట్టిన ఈ విధానాన్ని రాజకీయ కక్షతో కూటమి ప్రభుత్వం తొలగించిందని విమర్శించారు. ప్రజలకు మంచి చేయడాన్ని కూడా కూటమి ప్రభుత్వం తట్టుకోలేకపోతోందని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వం చేసిన మంచి పనులను సైతం రాజకీయ ప్రయోజనాల కోసం పక్కన పెట్టడం సరి కాదన్నారు. తక్షణమే ఎండీయూ వ్యవస్థను తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ఎండీయూ ఆపరేటర్లు చేపట్టే ఆందోళనకు తమ పార్టీ సంపూర్ణ మద్దతునిస్తుందని విద్యాసాగర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్ సీపీ యూత్ ప్రెసిడెంట్ రాగిరెడ్డి బన్నీ, పార్టీ సిటీ యూత్ ప్రెసిడెంట్ రోకళ్ల సత్యనారాయణ, జిల్లా వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంట్ చిక్కాల సుధాకర్, కాకినాడ జిల్లా మైనారిటీ సంఘం అధ్యక్షుడు బాషా, బీసీ సెల్ అధ్యక్షులు వాసుపల్లి కృష్ణ, సోషల్ మీడియా అధ్యక్షులు హేమంత్ కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా

ఇంటింటికీ రేషన్ సరుకులు అందించే వాహనాలను కొనసాగించాలని, తమను ఆదుకోవాలని కోరుతూ ఎండీయూ ఆపరేటర్స్ యూనియన్ జిల్లా సమాఖ్య ఆధ్వర్యాన కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ, తాము రుణాలపై ఈ వాహనాలు కొనుగోలు చేశామని, ఇప్పుడు అర్ధాంతరంగా ఎండీయూ వాహనాలను ఆపేస్తామనడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఇంటికీ రేషన్ సరుకులు, అందించామని, వృద్ధులు, దివ్యాంగులు, మంచంపై ఉన్న వారి వద్దకు నేరుగా వెళ్లి సరకులు అందించిన సందర్భాలు న్నాయని అన్నారు. విజయవాడ వరదల సమయంలో తాము అందించిన సేవలను సీఎం చంద్రబాబు మెచ్చుకున్నారని గుర్తు చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 1,074 మంది, కాకినాడ జిల్లాలో 420 మంది ఎండీయూ వాహనాల ద్వారా ప్రజలకు ఇంటి వద్దనే రేషన్ అందజేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో 18,500 మంది ఎండీయూ వాహనాలపై ఆధారపడి కుటుంబాలను నెట్టుకొస్తున్నారన్నారు. తమను ఆదుకోని పక్షంలో చావే మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిల్లి దుర్గాప్రసాద్, సిద్ధాంతపు రవికుమార్, నోయిళ్ల దుర్గారావు, నక్కా వెంకటరమణ, బుర్ర శ్రీను, తోలెం లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎల్ ఫ్యాన్ పార్క్ ఏర్పాట్లు పూర్తిచేయండి

కలెక్టర్ షణ్మోహన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: స్థానిక ఐపీఎల్ ఫ్యాన్ పార్క్‌కు అవసరమైన అన్ని అనుమతులు మంజూరు చేయడంతో పాటు, ఇతర ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ షణ్మోహన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కాకినాడలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ఐపీఎల్ ఫ్యాన్ పార్క్ ఏర్పాట్లు, హాకీ స్టేడియం అభివృద్ధి పనులపై జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు, కన్సల్టెంట్ ఏజెన్సీ ప్రతినిధులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐపీఎల్ క్రికెట్ సందడిని అభిమానులకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో బీసీసీఐ ఐపీఎల్ ఫ్యాన్ పార్కులను దేశవ్యాప్తంగా ప్రముఖ నగరాల్లో ఏర్పాటు చేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి, రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు ప్రతిపాదన మేరకు బీసీసీఐ స్థానిక డీఎస్ఏ మైదానంలో ఐపీఎల్ సెమీ ఫైనల్ జూన్ 1, ఫైనల్ మ్యాచ్ 3వ తేదీల్లో ఈ పార్క్ ద్వారా వీక్షించేందుకు ఉచితంగా అవకాశం కల్పిస్తోందన్నారు. మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారం, మ్యూజిక్, ఎంటర్‌టైన్‌మెంట్, ఫుడ్ కోర్టులు, కిడ్స్ ప్లే జోన్, ఫొటో బూత్స్, డగౌట్లు, ఫేస్ పెయింటింగ్ స్టేషన్లతో అచ్చం మైదానంలో ఎలాంటి వాతావరణం ఉంటుందో అలాంటి వాతావరణాన్నే ఫ్యాన్ పార్కులలో కూడా సృష్టించనున్నారని కలెక్టర్ తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అంబులెన్స్‌తో పాటు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ప్రేక్షకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే డీఎస్ఏ మైదానంలో ఉన్న హాకీ స్టేడియం లైట్లు, గ్యాలరీ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి శ్రీనివాసరావు, బీసీసీఐ ప్రతినిధి యోగేశ్వరరావు, ఆర్అండ్‌బి ఇంజినీర్లు శ్రీనివాస్, శ్రీనివాసరావు, డి.మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



యోగాసనాలపై శిక్షణ పొందుతున్న సాధకులు

కరప: స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మూడు రోజుల పాటు నిర్వహించే యోగా శిక్షణ తరగతులను ఎంపీడీఓ ఎం.అనుపమ మంగళవారం ప్రారంభించారు. యోగాసనాలతో మానసిక ప్రశాంతత, జ్ఞాపకశక్తి వృద్ధి చెంది, శారీరక, మానసిక ఉన్నతి పెంపొందుతుందని ఆమె పేర్కొన్నారు. జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలం నుంచి ముగ్గురు మాస్టర్ ట్రైనర్లు, పీఈటీలు నాగమల్లేశ్వరరావు (గురజానపల్లి), బి.చంద్రశేఖర్ (కరప), పీడీ కృష్ణ (వేళంగి) గ్రామ స్థాయిలో యోగా ట్రైనర్‌గా రిజిస్టర్ అయినవారికి శిక్షణ తరగతులు నిర్వహిస్తారని ఆమె తెలిపారు. శిక్షణ పొందినవారు తమ గ్రామాల్లో ప్రజలకు యోగాపై శిక్షణ ఇవ్వాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ ఎస్వీ శ్రీనివాసరావు, పీఎస్ఆర్ బ్రహ్మానందం, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. మాస్టర్ ట్రైనర్లు యోగా శిక్షణ ఇచ్చారు.

గురజానపల్లిలో..

మండలంలోని గురజానపల్లి ఆయుష్ ఆసుపత్రిలో, గ్రామ సచివాలయంలో మంగళవారం యోగాంధ్ర నిర్వహించారు. డాక్టర్ దివ్య యోగాసన, క్విజ్ పోటీలు నిర్వహించారు. యోగా గురువు పి.లోవరాజు యోగా ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం యోగాంధ్ర-2025 ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలతో అప్రమత్తం



సూర్యారావుపేటలో ప్రచారం చేస్తున్న తిమ్మాపురం పోలీసులు

కాకినాడ రూరల్: సూర్యారావుపేట, బీచ్, పలు ప్రాంతాలలో దొంగతనాలు జరుగుతున్నందున ప్రజలు, బీచ్ సందర్శకులు అప్రమత్తంగా ఉండాలని తిమ్మాపురం పోలీసులు విస్తృతంగా ప్రచారం చేపట్టారు. బీచ్ సందర్శనకు వచ్చేవారు తమ కార్లలోనే విలువైన బంగారు ఆభరణాలను ఉంచడంతో దొంగలు సులువుగా వాటిని కాజేస్తున్నారు. ఇటీవల కాలంలో బీచ్‌లో ఈ తరహా కేసులు ఎక్కువ కావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండడంతో పాటు, ఇళ్ల నుంచి ప్రయాణాలు చేసేటపుడు కూడా విలువైన వస్తువులు వస్తువులు ఇంటి బీరువాలలో ఉంచవద్దని తెలియజేస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఇంటి తాళం వేసినట్టుగా తెలియకుండా జాగ్రత్తలు పాటించాలని ఎస్సై మూర్తి కోరారు. మంగళవారం తిమ్మాపురం స్టేషన్ పరిధిలో సూర్యారావుపేట బీచ్‌తో పాటు గ్రామంలోని, నేమాం బీచ్ వద్ద ప్రచారం ముమ్మరం చేశారు.